సామాన్యుల నెత్తిన కూరగాయాలు

- అనూహ్యంగా పెరిగిన ధరలు
- అదే దారిలో మాంసం ధర
- ఆందోళనలో మధ్య తరగతి ప్రజలు

పెదవేగి : ప్రస్తుత వేసవిలో ఎండలే కాదు, కూరగాయల ధరలూ మండుతున్నాయి. దీంతో సామాన్యులకు కూరగాయలు కొనాలంటే భయం వేస్తోంది. అదే మార్గంలో కోడి మాంసం ధరలు కూడా పెరగడంతో ఏం కొనాలో.. ఏం తినాలో తెలియక సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూ.100 పెడితే అన్ని రకాల కూరగాయలు సంచి నిండా వచ్చేవి. కానీ ప్రస్తుతం రెండు రకాల కూరగాయాలు కూడా రాని పరిస్థితి నెలకొంది. పోనీ కోడి మాంసం ధరైనా అందుబాటులో ఉందంటే కేజీ రూ.225 పైనే ధర పలుకుతోంది. దీంతో ఇటు కూరగాయలు, అటు మాంసం కొనుగోలు చేయలేకపోతున్నామని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

పెరిగిన ధరలతో పస్తులు

ప్రస్తుతం ఎండలు విపరీతంగా మండుతుండటంతో కూలీలకు పనులు లేవు. ఉపాధి పనులకు వెళుతున్నప్పటికీ వచ్చే అరకొర కూలీతో ఆకాశాన్నంటుతున్న కూరగాయలను కొనుగోలు చేయలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూరగాయల్లో ప్రస్తుతం అల్లం, పచ్చిమిర్చి ధరలు బాగా అధికంగా ఉన్నాయి. దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా చుట్టుపక్కల గ్రామాలనుంచి సమీప ఏలూరు రైతు బజారుకు ప్రజలు వస్తుంటారు. కానీ ప్రస్తుతం కూరగాయల ధరలు అధికంగా ఉండటంతో వీటిని కొనుగోలు చేయడానికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండలంలో రైతులు ఎక్కువగా బీర, వంకాయ వంటి కూరగాయలు పండిస్తుంటారు. వీటిని రైతులు నేరుగా అమ్ముకునే పరిస్థితి లేకపోవడంతో దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో మార్కెట్‌లో ధరలు పెరుగుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ కూరగాయల ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ధరల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టి, కూరగాయల ధరలు, మాంసం ధరలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కూరగాయల ధరలు హోల్‌సేల్‌లో కిలోకు

ఉల్లిపాయలు	రూ.20–రూ.25
పచ్చిమిర్చి	రూ.32
అల్లం	రూ.64
టమాటా	రూ.24
బీరకాయలు	రూ.44
వంకాయలు	రూ.44
బీట్‌రూట్	రూ.36
క్యారెట్	రూ.42
బెండకాయలు	రూ.28
దొండకాయలు	రూ.30
బంగాళదుంపలు	రూ.30

కుటుంబ పోషణ భారం



ప్రతి వస్తువు ధర పెరిగింది. ఏది కొనాలన్నా భయమేస్తోంది. మాకు కూలీ ధరలు మాత్రం పెరగలేదు. నిత్యావసర వస్తువులు రోజురోజుకూ పెరుగుతుంటే మాలాంటి పేదలు బతికేదెలా. కుటుంబ పోషణ భారంగా మారింది. ధరలను అదుపు చేయాలి.
– రౌతు ఎల్లమ్మ, గ్రామస్తురాలు, విజయరాయి

రేషన్ దుకాణాల్లో ఇవ్వాలి



రేషన్ దుకాణాల్లో పూర్తి స్థాయిలో పప్పు దినుసులు, వంట నూనెలు, ఉల్లిపాయలు వంటి సరుకులు ఇస్తే బాగుంటుంది. కిరాణా దుకాణాల్లో రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారు. రోజులు గడవటం కష్టంగా మారిపోయింది. ధరల నియంత్రణపై ప్రభుత్వం ఆలోచించాలి. – స్వర్జన్ రాజు, గ్రామస్తుడు, కొండలరావుపాలెం

క్లుప్తంగా

దోమ తెరల పంపిణీ



దోమ తెరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ మానస

ఉంగుటూరు: ఆమెన్ ట్రస్టు అందిస్తున్న సేవలు విలువైనవని కాగుపాడు పీహెచ్‌సీ డాక్టర్ మానస అన్నారు. కొత్త ఉంగుటూరులో సోమవారం 102 మందికి దోమ తెరలను ఆమెన్ ట్రస్టు సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ దోమ తెరలు వాడితే దోమలు దరి చేరవన్నారు. తాడేపల్లిగూడెం సబ్‌యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. లార్వా దశలోనే దోమలను నివారించాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కె.శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకులు ఎస్.సత్యనారాయణ, ఆరోగ్య సహాయకులు గణపతి, కార్యకర్తలు సరోజ, చంద్రలీల, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి సామగ్రి బహూకరణ



పీహెచ్‌సీకి సామగ్రిని అందజేస్తున్న దాత

గణపవరం: మండలంలోని కేశవరం గ్రామానికి చెందిన దాత వేగేశ్న రమేష్ వర్మ ఆర్థిక సాయంతో పీహెచ్‌సీ వైద్యాధికారి గదిలో ఒక ఏసీ, ప్రసూతి వార్డులో ఒక ఏసీ అందజేశారు. జనరల్ వార్డులోకి ఆరు పరుపులను అందజేశారు. ఈ సందర్భంగా దాత రమేష్ వర్మను పలువురు అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్ ఇందుకూరి రామకృష్ణం రాజు, కొయ్యా సుబ్బారావు, కొలనువాడ శ్రీనివాసరాజు, రంగరాజు, కె.ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాస్



దెందులూరు: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి లిఖితపూర్వ ఆదేశాలు జారీ చేశారు. శ్రీనివాస్ ఏలూరు రూరల్ మండలం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేస్తూ సాధారణ బదిలీల్లో దెందులూరు డీటీగా వచ్చారు.


ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



నూతన ఆలయ నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

భీమడోలు: గుండుగొలనులో అతి పురాతన దేవాయం ఆంజనేయస్వామి ఆలయం పునర్నిర్మాణ పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధికి చెందిన ఈ ఆలయం 240 సంవత్సరాల క్రితం నిర్మించబడింది. దీంతో ఈ ఆలయం వర్షానికి శ్లాబ్ లీకై నీరు ఆలయంలోకి చేరుతుంది. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో స్పందించిన గ్రామానికి చెందిన దాతలు భోగరాజు పుండరీకాక్షుడు, రాధ దంపతులు, అమెరికాలోని మహిళా ఎన్‌ఆర్‌ఐలు రూ.70 లక్షల ఆర్థిక సాయం చేశారు. ఆలయ అర్చకులు లంకా శివకుమార్, శ్రీనివాస శర్మ, ఆజీయ్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన దాతలను గ్రామ పెద్దలు అభినందించారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు



తిమ్మయ్యపాలెం ఖండ్రిక చెరువులో అక్రమంగా మట్టి తవ్విన దృశ్యం

ఉంగుటూరు: తిమ్మయ్యపాలెం గ్రామం చెరువులో మట్టి అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. మట్టి తీయడానికి అనుమతులు తీసుకున్నామని చెబుతూ అనుమతి పొందిన దాని కంటే ఎక్కువ తవ్వి మట్టితో వ్యాపారం సాగిస్తున్నారు. తిమ్మయ్యపాలెం ఖండ్రిక చెరువులో అక్రమంగా మట్టిని తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. టీడీపీ నాయకుల నేతృత్వంలో ఈ మట్టి దందా నడుస్తోంది. ఈ విషయంపై తహసీల్దార్ రవికుమార్‌ను వివరణ అడగగా కొన్ని చెరువులు అభివృద్ధికి అనుమతులు తీసుకున్నారని తెలిపారు. మట్టిని అక్రమంగా తవ్వేవారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. వీఆర్వోలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని తహసీల్దార్ వివరించారు.

కోకో గిట్టుబాటు ధరలపై ఆరా



కోకో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం దెందులూరు తహసీల్దార్ బి.సుమతి గంగన్నగూడెం, నాగులదేవునిపాడు గ్రామాల్లో కోకో తోటలను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి కోకో పంట దిగుబడి ఖర్చు, సాగు రవాణా వాతావరణ పరిస్థితులపై క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. కోకో రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ శ్రీనివాస్, కోకో రైతులు పాల్గొన్నారు.

పంట కాలువలోకి నీరు విడుదల

భీమడోలు: ఏలూరు పంట కాలువలోకి నీటిని విడుదల చేశారని, ఈ నెల 10వ తేదీ మంగళవారానికి పూళ్ల చేరుకుంటుందని గుండుగొలను వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ గంధం లక్ష్మణ్ సోమవారం రాత్రి తెలిపారు. కానీ కాలువలో నీటి స్థాయి నిలవడానికి నాలుగైదు రోజులు పడుతుందని ఆయన తెలిపారు. నవాబుపాలెం వద్ద అడ్డుకట్టను తొలగించామన్నారు. గ్రామాల్లోని మంచినీటి చెరువుల్లోకి నీటిని నింపేందుకు చర్యలు చేపడతామన్నారు. తాగునీటి ఇబ్బందులు తీరుతాయని, ప్రజలు ఆందోళన చెందనవసరం లేదని ఆయన తెలిపారు.

కొండెక్కిన.. రైతు వద్దకు సేవలు

- సకాలంలో అందని ఎరువులు, విత్తనాలు
- అందని పెట్టుబడి సాయం
- రైతుసేవా కేంద్రాలు నిర్వీర్యం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

దెందులూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతుకు పెట్టుబడి సాయం ఇంత వరకు అందించలేదు. రైతులకు అవసరానికి ఎరువులు, విత్తనాలు పురుగు మందులు పంపిణీ చేయడం లేదు. గడిచిన 11 నెలలుగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విత్తనాల సరఫరా సక్రమంగా లేదు. ఎరువుల కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. చివరికి పండిన ధాన్యం అమ్ముకోలేక అవస్థలు పడ్డారు. ఇప్పుడు రైతులు సార్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికైనా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో రైతులకు ఎన్నో పథకాలు అమలు చేసింది. ఐదేళ్ల సమయానికి పెట్టుబడి సాయం అందించింది. పంటల బీమా, వడ్డీ రాయితీ ఇలా పలు పథకాలు అమలు చేసి, రైతుల కళ్లల్లో ఆనందం చూసింది. ఎరువులు, విత్తనాలు రైతు వద్దకు చేర్చింది. నిత్యం రైతు భరోసా కేంద్రాలు ప్రజలతో కలకలాడుతూ ఉండేవి. రైతు విజ్ఞాన కేంద్రాలుగా ఆర్బీకేలు వర్ధిల్లాయి. ఇప్పుడు అంతా మారింది రైతులపై కక్ష కట్టిన కూటమి ప్రభుత్వం ఈ 11 నెలల్లో రైతులను అన్ని విధాలుగా ఇబ్బందులు పెడుతూ వచ్చింది. దీంతో ఇప్పుడు రైతుసేవా కేంద్రాల వైపు రైతులు కన్నెత్తి చూడటం లేదు. రైతుసేవా కేంద్రాల్లోని యంత్రాలు మూలకు చేరాయి. రైతుసేవా కేంద్రాలు కళాహీనంగా మారాయి.



సార్వా సాగుకు సిద్ధమవుతున్న రైతు

పెట్టుబడి సాయం ఇవ్వరా?



ఎన్నికల ముందు రైతులకు గత ప్రభుత్వం కంటే మెరుగ్గా ఆదుకుంటామని చెప్పారు. వ్యవసాయ అభివృద్ధికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటింది. సాగుకు ముందు ప్రభుత్వం అందించే సాయం ఊసే ఎత్తటం లేదు. గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగుకు ముందు రైతు భరోసా అందించారు. రైతులకు వెన్నుదన్నుగా నిలిచారు.
– పర్వతనేని నరేంద్రబాబు, రైతు

ఐదుగురికి షైనింగ్ స్టార్ అవార్డులు



చల్లారి రమ్యశ్రీ | చైతన్య శ్రీ | బీద జ్యోతిష్ | సుస్మిత జూజీ | కె.తేజస్విని

దెందులూరు: మండలంలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ఐదుగురికి షైనింగ్ స్టార్ అవార్డులు లభించాయని మండల విద్యాశాఖ అధికారి ఏవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. సోమవారం దెందులూరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఆయన షైనింగ్ స్టార్ అవార్డుల వివరాలు తెలిపారు. దెందులూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని చైతన్య, శ్రీమేధినరావుపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థిని చల్లారి రమ్యశ్రీ,, కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థి బీద జ్యోతిష్ లోహిత్‌కుమార్, గోపన్నపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.తేజస్విని, గంగన్నగూడెం ఉన్నత పాఠశాల విద్యార్థిని సుస్మితజుజీలకు అవార్డులు లభించాయన్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.20 వేల నగదు, ప్రశంసా పత్రం మంత్రి మనోహర్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే అందజేశారు.

జ్వరాన్ని నిర్లక్ష్యం చేయకూడదు



మలేరియాపై అవగాహన ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల్లో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, జ్వరం వస్తే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.కిరణ్మయి, కె.ఓంకార్‌నాథ్‌లు అన్నారు. సోమవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా పీహెచ్‌సీలో మలేరియా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవడం మంచిదని, మలేరియా లేదని తేలితే భయపడనవసరం లేదన్నారు. ఒకవేళ మలేరియా లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స పొందడంద్వారా మలేరియా వ్యాధి నుంచి బయట పడొచ్చన్నారు. ప్రతి శుక్రవారం పొడి వారంగా పాటించాలని, తడి, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని, దోమలు పుట్టకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నీటి నిల్వలు, కొబ్బరి బొండాలు, పాతటైర్లు, పాత సామాన్లు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టు నేతకు సీపీఐ సంతాపం



మావోయిస్టు నేతకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పెదపాడు: మావోయిస్టు కీలక నేత తెంటు లక్ష్మీనరసింహాచలం అలియాస్ సుధాకర్ మృతికి సీపీఐ ఏలూరు జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు సంతాపాన్ని తెలిపారు. చత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన తెంటు సుధాకర్ మృతదేహాన్ని సత్యవోలు తీసుకొచ్చారని తెలియగానే సోమవారం సుధాకర్ ఇంటికి వెళ్లారు. అప్పటికే దహన సంస్కారాలు పూర్తవడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుధాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు కంకిపాటి బుచ్చిబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు



ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనం

ఉంగుటూరు: మండలంలోని కైకరం వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమడోలు మండలం గుండుగొలనుకు చెందిన సురేష్, ప్రేమ్‌చంద్ బైక్‌పై వెళుతుండ గా, కైకరం వద్ద లారీని ఢీకొన్నారు. ఈ ఘటనలో యువకులు ఇద్దరూ గాయపడగా, క్షతగాత్రులను హైవే పెట్రోలింగ్ పోలీసులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా 9న వైద్య పరీక్షలు చేయించుకోవాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం పోతునూరు పీహెచ్‌సీలో 37 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాయామం, విశ్రాంతి క్రమం తప్పకుండా మందులు తీసుకోవడం, ఇతర వైద్యపరమైన సూచనలు, సలహాలను అందజేశారు. ఎంపీహెచ్‌ఓ ప్రభాకర్‌రావు, సూపర్‌వైజర్ హరి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణలో ఆహార నిర్వహణ ముఖ్యం



రైతులకు అవగాహన సమావేశం నిర్వహించిన శాస్త్రవేత్తలు

ఉంగుటూరు: పశు పోషణలో యాజమాన్య పద్ధతులు అవలంభించడం వలన పాల ఉత్పాదక సామర్థ్యం పెరుగుతుందని శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ గేదెల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగరాజకుమారి అన్నారు. మండలంలోని నచ్చుగుంటలో సోమవారం పశుపాలన, వ్యాధి నివారణ, ఉష్ణ సమయాలు, ఆహార నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.నాగరాజకుమారి మాట్లాడుతూ పశువులకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. పశువులకు సమతుల ఆహారం ఇవ్వడం ద్వారా పాల ఉత్పాదకతను గణనీయంగా పెంచొచ్చన్నారు. డాక్టర్ మేరీ రాణి, ప్రిన్సిపల్ సైంటిస్ట్, పెదవేగి ఐఐఓపీఆర్ మొబైల్ అప్లికేషన్లలో ఆయిల్ పామ్ క్రాప్ గురించి వివరించారు. మొక్కల్లో పోషకాల నిర్వహణ, లోపాన్ని, వాటిని ఎలా గుర్తించాలో శాస్త్రవేత్త డాక్టర్ ప్రేమలత వివరించారు. ఆర్‌ఏఆర్‌ఎస్, ఏఎన్‌జీఆర్‌ఏయూ మార్టేరులో అభివృద్ధి చేసిన వరి రకాల గురించి మండల వ్యవసాయ అధికారి డాక్టర్ ప్రవీణ్ వివరించారు. వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి మిశ్రమ చేపల పెంపకం గురించి కేవీకే శాస్త్రవేత్త ఎ.దేవీవర ప్రసాద్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఎ.దేవీవర ప్రసాద్‌రెడ్డి, వీపీఏ రాజు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలి

భీమడోలు: యోగాంధ్ర లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పని చేయాలని తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం భీమడోలు, పోలసానిపల్లి గ్రామాల్లో యోగాంధ్ర ర్యాలీలు, మానవ హారం నిర్వహించారు. ఆరోగ్యమే మహాభాగ్యం, ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం యోగ అనే నినాదాలతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజా ప్రతినిధులు, పెద్దలు, మహిళలు ర్యాలీ నిర్వహించారు. పోలసానిపల్లి నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి, గ్రామ కార్యదర్శులు తనూజ, జయరామకృష్ణ, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమడోలు:యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీవోలు, గ్రామ పెద్దలు

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ర్యాలీ

దెందులూరు: దెందులూరులో 11 అంతర్జాతీయ యోగా ర్యాలీ సోమవారం నిర్వహించారు. స్థానిక ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి పాత ఆసుపత్రి, లైబ్రరీ సెంటర్, బస్టాండ్ సెంటర్, ఇంద్రవరం మీదుగా ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో కె.శ్రీదేవి, ఏపీఎం సురేష్, ఏవో భీమరాజు, ఏఈ చౌదరి, యాదవుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి.మహేష్‌యాదవ్, వీఆర్‌వోలు, సెక్రటరీలు సచివాలయ సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యం

ఉంగుటూరు: యోగ చేస్తే ఆరోగ్యం మీ వెంటే అని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం మండలంలోని నారాయణపురం, చేబ్రోలులో యోగాపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. చేబ్రోలు సర్పంచి రందే లక్ష్మీసునీత మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని సూచించారు. ర్యాలీలో మాజీ సర్పంచి రందే రాజు, యోగా ట్రైనర్ యెలిశెట్టి కిషోర్, రిటైర్డ్ జడ్జి బొమ్మిడి అప్పారావు, రిటైర్డ్ పీడీ ఆదిరెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఉంగుటూరు: నారాయణపురంలో ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు



దెందులూరు: ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్, అధికారులు

జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక

బుట్టాయగూడెం: జాతీయ ఉపకార వేతనానికి రెడ్డిగణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి మడకం కృష్ణ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. రామారావు సోమవారం తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్ఎమ్ఎస్ ప్రతిభా పరీక్షల్లో కృష్ణ ఉత్తీర్ణత పొందినట్లు చెప్పారు.